https://teluguislam.net



# అధ్యాయం–11

# 220–243

# 11–తోటి మనిషిని ప్రేమిస్తే అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు

- పరస్పరం ప్రేమానుబంధాలను పెంచుకోవాలి.
- పరామర్శించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- ఒండొకరిని సందర్శించుకునే వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- ఉపకారం (ఇహ్సాన్) చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు.
- తోటి సహోదరులకు సహాయపడితే అల్లాహ్ ప్రేమిస్తాడు.
- అనాధులను ఆదరిస్తే అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు.
- ఆడ పిల్లలను పెంచి పోషిస్తే అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు.

https://teluguislam.net



# 11– తోటి మనిషిని ప్రేమిస్తే అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు

## పరస్పరం ప్రేమానుబంధాలను పెంచుకోవాలి:

ప్రతి మనిషి కొరకు ఇస్లాం ధర్మం ఆచరణే ప్రేమానుబంధాలకు నిజమైన మార్గం. మనిషి తన జీవితపు ప్రతి కోణంలో ప్రతి నిమిషంలో ప్రేమానుబంధాలను సమాజం పట్ల పెంపొందించుకోవడాన్ని ప్రేమ అంటారు. ప్రేమానుబంధాలు ఒక రోజు కొరకో, ఒక వారాని కొరకో, లేదా సంవత్సరానికి ఒక రోజు సంబరాలు జరుపుకోవడం కాదు ప్రేమంటే. ప్రేమానుబంధాలు రోజు రోజుకు మెరుగుపడడమే అసలైన, నిజమైన ప్రేమ. మన ఊపిరి ఉన్నంత కాలం ఒకరిపట్ల మరొకరు ప్రేమానుబంధాలు కలిగి ఉంటే దీనిని నిజమైన ప్రేమ అంటారు. ఆ అనుబంధాలను చిత్తశుద్ధితో అల్లాహ్ భీతితో ఒండొకరి పట్ల కనబరిస్తే అల్లాహ్ కూడా వారిని ప్రేమిస్తాడు. మరియు దానికి బదులు గొప్ప బహుమానాలు కూడా ఆయన ప్రసాదిస్తాడు. మానవులందరూ ఒండొకరి పట్ల చిత్తశుద్ధి కలిగి, ప్రేమాభిమానంతో, గౌరవ సన్మానాలతో మసులుకుంటే వారు ఇహపర జీవితాలలో సుఖసంతోషాలు పొందుతారు. ఎవరైతే సమాజాన్ని ప్రేమించలేరో వారు పరిపూర్ణమైన ముస్లిములు కారు. మరియు వారిని కూడా అల్లాహ్ ఎంత మాత్రమూ ప్రేమించడు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ‘‘అల్లాహ్ నీకు ఏ విధంగా మేలు చేసాడో అదే విధంగా నువ్వు కూడా (ప్రజల పట్ల) సద్వ్యవహారం చెయ్యి.

https://teluguislam.net



భువిలో అరాచకం కోసం ఆరాట పడకు. అరాచకం సృష్టించగోరేవారిని అల్లాహ్ ఎంత మాత్రం ఇష్టపడడు.'' [1]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ప్రళయదినాన అల్లాహ్, ''నా ఔన్నత్యం ప్రాతిపదికపై పరస్పరం అభిమానించుకున్నవారు ఎక్కడున్నారు? నా (కారుణ్య) నీడ తప్ప మరే నీడ లభించని ఈ రోజు నేను వారికి నా నీడ పట్టున ఆశ్రయం కల్పిస్తాను'' అని అంటాడు.[2]

మరియు హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:
''మీరు మూమిన్ (విశ్వాసి) కానంతవరకు స్వర్గంలో ప్రవేశించలేరు. మరియు మీరు పరస్పరం ప్రేమాభిమానాలతో మెలగనంతవరకు మూమిన్లు (విశ్వాసులు) కాలేరు....'' [3]

ప్రేమానుబంధాల పట్ల అల్లాహ్ ప్రతి ఒక్కరి కొరకు ఒక ఉన్నత స్థానాన్ని నిర్ణయించాడు. దానిలో మొట్టమొదటి స్థానం అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)గారి స్థానం అతి ఉన్నతమైనది. ఆ తరువాత తల్లిదండ్రుల స్థానం. ఆ విషయాలను మనం ముందు పేజీలలో తెలుసుకున్నాము. ఇప్పుడు మనం సమీప బంధువుల పట్ల, గురువు, శిష్యుల పట్ల, భార్యాభర్తల పట్ల, అన్నదమ్ముళ్ళ పట్ల, అక్కచెల్లెళ్ల పట్ల, స్నేహితుల పట్ల, ఇరుగు పొరుగు వారి పట్ల, అనాథుల పట్ల,

---

[1] (సూరతుల్ ఖసస్: 77).
[2] (ముస్లిం:4655).
[3] (ముస్లిం:81).

https://teluguislam.net



వికలాంగుల పట్ల, దరిద్రుల పట్ల, పశుపక్షాధుల పట్ల మరియు అనేకమైన సమాజ సంబంధిత జాతుల పట్ల ప్రేమాభిమానంతో మసులుకోవలసిన విధానాలను తెలుసుకుందాము. ఆ విధానాల ప్రకారం ప్రజలు జీవించి నట్లయితే అల్లాహ్ ప్రీతిని పొందుతారు.

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మీరు అల్లాహ్‌నే ఆరాధించండి. ఆయనకు ఎవ్వరినీ భాగస్వాములుగా చేసి నిలబెట్టకండి. తల్లిదండ్రులతో, దగ్గరి బంధువులతో, అనాధలతో, నిరుపేదలతో, బంధువులైన పొరుగువారితో, ప్రక్కనున్న మిత్రులతో, అందరితోనూ ఉదార స్వభావులై మెలగండి. నిశ్చయంగా అల్లాహ్ దురహంకారిని, గొప్పలు చెప్పుకుని బీరాలు పోయేవాడిని ప్రేమించడు.'' [1]

ఒక హదీసులో ఇలా ఉంది: ''పరస్పర ప్రేమానురాగాలను పంచుకో వటంలోనూ, ఒండొకరిపై దయజూపటంలోనూ విశ్వాసుల ఉపమానం ఒక శరీరం లాంటిది. శరీరంలోని ఏదైనా ఒక అవయం బాధకు గురైనప్పుడు మొత్తం శరీరానికి నొప్పి కలుగుతుంది. శరీరమంతా వ్యాకులతకు లోనవుతుంది.'' [2]

మరియు మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఒక బంధువు ఉపకారం చేస్తే ప్రతిగా ఉపకారం చేసేవాడు (నిజమైన) బంధుప్రియుడు కాడు. తెగతెంపులు చేసుకున్నప్పటికీ వారితో సత్సంబంధాన్ని కొనసాగించే వాడే (సిసలైన) బంధుప్రియుడు.'' [3]

---

[1] (సూరతున్ నిసా: 36).

[2] (ముస్లిం:4685).

[3] (బుఖారీ:5532).

https://teluguislam.net



ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: బంధుత్వం అల్లాహ్ సింహాసనానికి వ్రేలాడబడి ఉంది. అది ఇలా ప్రార్థిస్తూ ఉంటుంది: ''నాతో సత్సంబంధాలు పెట్టుకున్నవాడితో అల్లాహ్ కూడా సత్సంబంధాలు పెట్టుకొనుగాక! నన్ను విచ్ఛిన్నం చేసినవాడిని అల్లాహ్ కూడా విచ్ఛిన్నం చేయుగాక!.'' [1]

మరియు మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **'మీరు పరస్పరం కరుణతో మెలగనంత వరకు విశ్వాసులు కాలేరు'** అని అన్నారు.

**అది విన్న సహచరులు:** యా రసూలల్లాహ్! 'మేమందరం పరస్పరం కరుణతోనే మసులుకుంటున్నాము కదా!' అని అన్నారు.

**అప్పుడు దైవ ప్రవక్త** (సల్లల్లాహు అలైహి వసల్లం): 'మీ ఈ పరస్పర కరుణ వాత్సల్యాలు కేవలం మీ ఆప్తుల వరకే పరిమితం కాకూడదు. **'రహ్మాతన్నాసి'** సమస్త మానవుల పట్ల కనికరం కలిగి ఉండాలి. **'రహ్మాతన్ ఆమ్మహ్'** విశ్వమంతటి ప్రాణుల పట్ల సాత్విక కరుణతో మెలగాలి' అని అన్నారు. [2]

హ్రజత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం: ఒక వ్యక్తి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర కూర్చుని ఉండగా మరో వ్యక్తి అతని సమీపం నుండి వెళ్ళాడు.

అప్పుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర కూర్చున్న వ్యక్తి, వెళ్ళుతున్న వ్యక్తి వైపు చూస్తూ, **'యా రసూలల్లాహ్! నేను ఇతన్ని ప్రేమిస్తున్నాను'** అని అన్నాడు.

---

[1] (బుఖారీ:5529, ముస్లిం:4635).

[2] (సహీహ్ తర్గీబ్ వత్తర్హీబ్:2253, అల్ ముస్తద్రక్ అలస్ సహీహైన్ లిల్‌హాకిమ్: 7418).

https://teluguislam.net



**ప్రవక్త** (సల్లల్లాహు అలైహి వసల్లం): 'మరి ఈ విషయం అతనితో చెప్పావా?' అని అన్నారు.

**అందుకావ్యక్తి**: 'చెప్పలేదు' అని అన్నాడు.

**అప్పుడు ఆయన (స):** 'నువ్వు ఈ సంగతి అతనికి తెలియజెయ్యి' అని అదేశించారు.

**అతను ప్రవక్త (స)** ఆదేశం విని, (తక్షణమే) ఆ వ్యక్తి, అతన్ని కలుసుకొని: 'అల్లాహ్ కోసం నేను నిన్ను ప్రేమిస్తున్నాను' అని చెప్పాడు.

**అందుకతను: 'ఎవరికోసం నువ్వు నన్ను ప్రేమిస్తున్నావో ఆయన కూడా నిన్ను ప్రేమించుగాక!'** అని అన్నాడు. [1]

అల్లాహ్ మనల్ని మానవులుగా సృష్టించాడు కాబట్టి అల్లాహ్ మనందరిపై ప్రతి మానవుడి హక్కులను సంరక్షించాలంటూ విధి గావించాడు. మరియు మనం ఒకరినొకరు సహాయ సహకారాలు అందజేస్తూ ఉండాలంటూ విధి విధానాలను తెలిపాడు. మనిషి తన వ్యక్తిత్వ జీవితానికి ఉత్తమమ్మైన విధానంలో గడపడానికి ప్రత్యేకమ్మైన సద్గుణాలను నేర్పాడు. వాటి ప్రకారం జీవితం గడిపితే మన జీవితాలు సుఖసంతోషాలతో కొనసాగుతాయి. మరియు అల్లాహ్ దగ్గర అతి ప్రియమ్మైన దాసులుగా కనికరించబడి ఉన్నతమ్మైన అంతస్తులు కూడా ప్రసాదించబడతాయి.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించగా తాను విన్నానని హజ్రత్ ముఆజ్ (రజియల్లాహు అన్హు)ఇలా తెలియజేశారు: ''నా ఔన్నత్యం ప్రాతి పదికపై పరస్పరం అభిమానించుకున్నవారి కోసం

---

[1] (సహీహ్ అబూదావూద్: 5125).

https://teluguislam.net



ప్రవక్తలు, అమర వీరులు సయితం అసూయ చెందేటువంటి జ్యోతిర్మయ వేదికలు ఉంటాయి.'' [1]

## ఒండొకరిని సందర్శించుకునే వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజియల్లాహు అన్హు)కథనం; ఆయన ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచించగా విన్నానని ఇలా తెలియజేశారు:

''అల్లాహ్ – తనకోసం పరస్పరం అభిమానించుకునేవారిని, తనకోసం ఒకచోట సమావేశమయ్యేవారిని, తన కోసం ఒండొకరిని సందర్శించు కొనేవారిని, తన కోసం ఒండవకరిపై ఖర్చు చేసేవారిని తాను తప్పకుండా ప్రేమిస్తానని అంటున్నాడు.'' [2]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ఒక వ్యక్తి వేరొక ఊరిలో ఉంటున్న తన సోదరుణ్ణి కలవటానికని (మంచిచెడు తెలుసుకొనుటకు) బయలుదేరాడు. **అంతలో అల్లాహ్ ఒక దూతను అతను వెళ్ళే దారిలో అతని వద్దకు పంపాడు.**

**ఆ దూత ఆ వ్యక్తితో**: 'ఎక్కడికి వెళ్ళుతున్నావనీ?' ప్రశ్నించాడు.

**ఆ వ్యక్తి ఆ దూతతో**: 'ఈ ఊరులో నా సోదరుడు ఉన్నాడు, అతన్ని కలవటానికి వెళ్తున్నాను' అని అన్నాడు.

**ఆ దూత:** 'అతను నీకేదైనా ఉపకారం చేసి ఉంటాడు, నువ్విప్పుడు అతని ఉపకారాన్ని తీర్చడానికి వెళ్తున్నావు కదా!' అని అడిగాడు.

---

[1] (తిర్మీజి: 2390, అహ్మద్:21066).

[2] (మాలిక్:1503, సహీహుల్ జామే: 4331).

https://teluguislam.net



**ఆ వ్యక్తి:** అలా ఏమీ కాదు. 'నేను అల్లాహ్ కోసమే అతన్ని ప్రేమిస్తున్నాను' అని అన్నాడు.

**తరువాత దైవదూత:** చూడు, నేను అల్లాహ్ తరపు నుండి నీ వద్దకు పంపబడిన దూతను. **'నీవు అతన్ని అల్లాహ్ కోసం ప్రేమించినట్లే, అల్లాహ్ కూడా నిన్ను ప్రేమస్తున్నాడని' చెప్పమని అల్లాహ్ నీవద్దకు నన్ను పంపాడు**' అని అన్నాడు. [1]

హ్రజత్ అబూ జర్ర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''మంచి పనిని ఏమాత్రం హీనంగా భావించకు. నీ సోదరుడిని చిరు నవ్వుతో కలుసుకోవడం కూడా పుణ్యకార్యమైనది.'' [2]

## వ్యాధిగ్రస్తులను పరామర్శించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

హ్రజత్ సౌబాన్ (రజియల్లాహు అన్హు) కథనం, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

''ఒక ముస్లింను పరామర్శించటానికి వెళ్ళి తిరిగి వచ్చేవరకూ అతను స్వర్గంలో తాజా పండ్లను ఏరినట్లు.'' [3]

హ్రజత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

**అల్లాహ్ ప్రళయ దినాన (దాసునికి):** 'ఓ ఆదం పుత్రుడా! నేను అస్వస్థతలో ఉన్నప్పుడు నీవు నన్ను పరామర్శించ లేదే?' అని ప్రశ్నిస్తాడు.

---

[1] (ముస్లిం:4656).

[2] (ముస్లిం:4760).

[3] (ముస్లిం:4658).

https://teluguislam.net



**అప్పుడు (దాసుడు):** ‘ఓ నా ప్రభూ! నేను నిన్ను పరామర్శించడమేమిటి? నీవే సర్వలోకాలకు ప్రభువు కదా!’ అని అంటాడు.

**తరువాత అల్లాహ్:** ‘నీకు గుర్తులేదా! నా ఫలాన దాసుడు అనారోగ్యంతో ఉంటే, నీవు పరామర్శకు అతని వద్దకు పోలేదే! ఏం నీకు తెలీదా!? అతన్ని నీవు పరామర్శించినట్లయితే నన్ను అక్కడ నీవు పొందేవాడివి కదా!’’ అని అంటాడు. [1]

హ్రజత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: **‘ప్రతి ముస్లింపై సాటి ముస్లింకు ఆరు బాధ్యతలున్నాయి’** అని అన్నారు.

**అప్పుడు అక్కడున్నవారు:** ‘అవి ఏవి?’ అని అడిగారు.

**తరువాత ప్రవక్త(స):** ఈ విధంగా బోధించారు:

1) ముస్లిం సోదరుడిని కలిస్తే అతనికి సలాం చెయ్యి.
2) అతను విందుకు ఆహ్వానిస్తే ఆహ్వానాన్ని స్వీకరించు.
3) అతను ఉపన్యాసం చెయ్యమని కోరితే ఉపన్యాసం చెయ్యాలి.
4) అతను తుమ్మి **‘అల్ హమ్దులిల్లాహ్’** అంటే నీవు దానికి **‘యర్‌హముకల్లాహ్’** అని బదులివ్వు.
5) అతను వ్యాధిగ్రస్తుడయితే వెళ్ళి పరామర్శించు.
6) అతను చనిపోతే అతని జనాజాకు (నమాజుకు మరియు శ్మశానానికి) తోడుగా వెళ్ళు.’’ [2]

---

[1] (ముస్లిం:4661).

[2] (ముస్లిం:4023).

https://teluguislam.net



హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక రోజు : **''ఈ రోజు మీలో ఎవరు ఉపవాసం ఉన్నారు?''** అని అడిగారు.

**దానికి హజ్రత్ అబూ బకర్ (రజి):** 'నేను' అని సమాధానమిచ్చారు.

**తిరిగి ప్రవక్త (స) గారు:** 'ఈ రోజు మీలో ఎవరు పేదవాడికి అన్నదానం చేశారు?' అని అడిగారు.

**దానికి హజ్రత్ అబూ బకర్(రజి):** 'నేను' అని సమాధానమిచ్చారు.

**మరలా ప్రవక్త (స) గారు:** 'ఈ రోజు మీలో ఎవరు జనాజా వెంట (ఖనన సంస్కారానికి) పోయారు?' అని అడిగారు.

**దానికి హజ్రత్ అబూ బకర్(రజి):** 'నేను' అని సమాధానమిచ్చారు.

ఆ తరువాత ప్రవక్త(స) గారు: 'ఈ రోజు మీలో ఎవరు రోగిని పరామర్శించారు?' అని అడిగారు.

**దానికి హజ్రత్ అబూ బకర్(రజి):** 'నేను' అని సమాధానమిచ్చారు.

**అప్పుడు ప్రవక్త ముహమ్మద్(స)** ఇలా ప్రవచించారు: **''ఏ వ్యక్తిలోనయితే ఈ గుణాలు సమకూర్చబడ్డాయో వారు తప్పక స్వర్గానికి పోతారు.''** [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అలీ (రజియల్లాహు అన్హు) తెలియజేశారు:

**''ఉదయం పూట** ఒక ముస్లిం తోటి ముస్లింను పరామర్శిస్తే, డెబ్భైవేల దైవదూతలు సాయంత్రం వరకూ అతని శ్రేయస్సు కోసం అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ఉంటారు.

[1] (సహీహ్ ఇబ్ను ఖుజైమా: 1954, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 953).

https://teluguislam.net



**అదే సాయంత్రం వేళ** పరామర్శిస్తే, ఉదయం వరకు డెబ్బైవేల దైవదూతలు అతని శ్రేయస్సు కోసం ప్రార్థిస్తూ ఉంటారు. ఇంకా అతని కోసం స్వర్గంలో ఒక తోట ఏర్పాటు చేయడం జరుగుతుంది.'' [1]

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''ఎవరైతే వ్యాధిగ్రస్తుణ్ణి పరామర్శించటానికి పోయి, అతని తల దగ్గర కూర్చొని ఏడు సార్లు:

**'అస్ అలుల్లాహల్ అజీమ, రబ్బుల్ అర్షిల్ అజీమి అయ్ యష్ఫియక'** (నేను స్వస్థత చేకూర్చమనీ మహోన్నత సింహాసనానికి సర్వోన్నతుడైన అల్లాహ్‌ను అర్థిస్తున్నాను.) ఆ పదాలను చదివినట్లయితే (ఆ వ్యాధి) అతనికి మరణం కాకతోతే, అల్లాహ్ అతనికి ఆ వ్యాధి నుండి స్వస్థత చేకూర్చుతాడు.''[2]

రోగులను పరామర్శించే విషయంలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తరతమ భేదాలుగాని, ముస్లిములు ముస్లిమేతరులన్న తేడా కాని కనబరచలేదు. ఎవరైనా వ్యాధిగ్రస్తులై ఉన్నారని తెలిస్తే, ప్రతి ఒక్కరిని పరామర్శించేవారు, మరియు వారిని ఓదార్చేవారు, మరియు నిజమైన ప్రభువువైపు ఆహ్వానించేవారు.

ఒక యూద బాలుడు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)కు సేవలు చేస్తుండేవాడు. ఒకసారి అతను వ్యాధిగ్రస్తుడయితే,

**ప్రవక్త ముహమ్మద్(స):** 'అతన్ని పరామర్శించటానికి వెళ్ళారు.'

అక్కడికి వెళ్ళి అతని తల దగ్గర కూర్చోని: **'ఇస్లాం స్వీకరించు బాబూ!'** అని అన్నారు.

---

[1] (సహీహ్ తిర్మిజీ: 969, సహీహ్ సహీహ్ ఇబ్ను మాజా: 1442).

[2] (సహీహ్ అబూదావూద్:3106, సహీహ్ తిర్మిజీ:2083, ఇబ్ను హిబ్బాన్, హాకిమ్).

https://teluguislam.net



**ఆ బాలుడు:** ఏం చెయ్యాలో అర్థం కాక తండ్రి వైపు చూడసాగాడు.

**ఆ తండ్రి తన కొడుక్కి:** 'అబుల్ ఖాసిం (ముహమ్మద్–స) మాట విను' బాబూ అంటూ హితవు చెప్పాడు.

**దాంతో ఆ బాలుడు: 'ఇస్లాం స్వీకరించి'** ముస్లిం అయిపోయాడు.

ఆ తర్వాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం): **'ఈ బాలుణ్ణి నరకాగ్ని నుండి కాపాడిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు'** అని అంటూ తిరిగి బయలుదేరారు. [1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి పినతండ్రి అబూతాలిబ్ ఒక అవిశ్వాసి. మరణకాలం దాపురించగానే ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆయన వద్దకు వెళ్ళారు.

ఆయనను పరామర్శించి: 'బాబాయి! మీరు **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** అని అనండి. **అల్లాహ్ వద్ద మీ కొరకు ఈ వాక్యం మాధ్యమంగా నేను అల్లాహ్‌కు సిఫారస్సు చేయగలను'** అని అన్నారు.

కాని ఆయన: ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి మాటను: **'అంగీకరించలేదు'** (అవిశ్వాసిగానే మరణించారు.) [2]

## ఉపకారం (ఇహ్సాన్) చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు:

ఉపకారం చేసేవారిని అరబీలో **'ముహ్సినీన్'** అంటారు. ఇది ఇహ్సాన్ అనే పదం నుండి వచ్చింది. ఇహ్సాన్ అంటే – అల్లాహ్ మన ముందర ఉన్నాడనీ, ఆయన మనల్ని గమనిస్తున్నాడని భావించి ప్రతి మంచి పనినీ

[1] (బుఖారీ:1268).

[2] (బుఖారీ:1272).

https://teluguislam.net



చిత్తశుద్ధితో, ఉత్తమ రీతిలో చేయటం అని అర్థం. ఇంకా ఆ మంచిపని దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విధానానికి అనుగుణంగా ఉండాలి. కీడు తల పెట్టేవారికి మేలు చేకూర్చాలి. అపకారానికి ఉపకారం చేయాలి. తమకు దక్కవలసిన హక్కు పూర్తిగా దక్కకపోయినా తమపై ఎదుటి వారికి ప్రాధాన్యత నివ్వాలి– ఇవన్నీ ఇహ్సాన్ (ఉపకారం, సదమరవర్తన) క్రిందికి వస్తాయి. [1]

కనుక అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''మేలు చేయండీ! నిశ్చయంగా అల్లాహ్ మేలు చేసేవారిని ప్రేమిస్తాడు.'' [2]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''అల్లాహ్ వారికి ప్రాపంచిక ఫలాన్నీ ఇచ్చాడు, పరలోకపు ఉత్తమ పుణ్యఫలాన్ని కూడా ప్రసాదించాడు. సత్కార్యాలను ఉత్తమ రీతిలో నిర్వర్తించేవారిని అల్లాహ్ ఎంతగానో ప్రేమిస్తాడు.'' [3]

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ''అల్లాహ్ ప్రళయ దినాన **(దాసునికి)** ''ఓ ఆదం పుత్రుడా! నేను అస్వస్థతలో ఉన్నప్పుడు నీవు నన్ను పరామర్శించలేదే?'' అని ప్రశ్నిస్తాడు.

**అప్పుడు(దాసుడు):** ''ఓ నా ప్రభూ! నేను నిన్ను పరామర్శించడమేమిటి? నీవే సర్వలోకాలకు ప్రభువు కదా!'' అని అంటాడు.

**తరువాత అల్లాహ్:** ''నీకు గుర్తులేదా! నా ఫలాన దాసుడు అనారోగ్యంతో ఉంటే నీవు పరామర్శకు అతని వద్దకు పోలేదే. ఏం నీకు తెలీదా! అతన్ని

---

[1] (అహ్సనుల్ బయాన్ తెలుగు: 1742).

[2] (సూరతుల్ బఖరా: 195).

[3] (అల ఇమ్రాన్: 148).

https://teluguislam.net



నీవు పరామర్శించినట్లయితే నన్ను అక్కడ నీవు పొందేవాడివి కదా!'' అని అంటాడు.

''ఓ ఆదం పుత్రుడా! నేను నీ వద్దకు అన్నానికై వచ్చాను. కాని నీవు నాకు అన్నం పెట్టలేదే?'' అని అల్లాహ్ ప్రశ్నిస్తాడు.

**అప్పుడు (దాసుడు):** ''ఓ నా ప్రభూ! నేను నీకు అన్నంపెట్టేదేమిటి? నీవే సర్వలోకాలకు ప్రభువు కదా!'' అని అంటాడు.

**తరువాత అల్లాహ్:** ''నీకు గుర్తులేదా! నా ఫలాన దాసుడు అన్నం పెట్టమని అడిగినప్పుడు నీవు అతనికి అన్నం పెట్టలేదే. ఏం నీకు తెలీదా! అతనికి నీవు అన్నం పెట్టిఉంటే నీవు దానిని(పుణ్యాన్ని) నా దగ్గర పొందేవాడివి కదా!'' అని అంటాడు.

**తరువాత అల్లాహ్:** ''ఓ ఆదం పుత్రుడా! నేను నీ వద్దకు నీళ్ళు త్రాగటానికి వచ్చాను. కాని నీవు నాకు నీళ్ళని త్రాపించలేదే?'' అని అంటాడు.

**అప్పుడు(దాసుడు):**''ఓ నా ప్రభూ! నేను నీకు నీళ్ళని త్రాగించడమేమిటి? నీవే సర్వలోకాలకు ప్రభువు కదా!'' అని అంటాడు.

**తరువాత అల్లాహ్:** నీకు గుర్తులేదా!''నా ఫలాన దాసుడు నీళ్ళు త్రాగించమని వచ్చినప్పుడు నీవు అతనికి త్రాగించలేదే! ఏం నీకు తెలీదా! అతనికి నీవు నీళ్ళు త్రాగించి ఉంటే నీవు అతన్ని నా దగ్గర (పుణ్యాన్ని) పొందేవాడివి కదా!'' అని అంటాడు. [1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''వారి కోసం వారి ప్రభువు దగ్గర వారు కోరినదల్లా ఉంది. సదాచార సంపన్నులకు లభించే ప్రతిఫలం ఇదే.'' [2]

---

[1] (ముస్లిం:4661).

[2] (సూరతు జుమర్: 34).

https://teluguislam.net



## తోటి సహోదరులకు సహాయపడితే అల్లాహ్ ప్రేమిస్తాడు:

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజియల్లాహు అన్హు) కథనం ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు ఒక వ్యక్తి వచ్చి:

**యా రసూలల్లాహ్!** ''అల్లాహ్ దగ్గర అతి ప్రియాతి ప్రియమైన మనుషులు ఎవరూ?'' అని అడిగాడు.

**దానికి ప్రవక్త (స):** ''ప్రజలకు అందరింకంటే ఎక్కువగా మేలుచేసేవాడు అల్లాహ్‌కు అందరికంటే ప్రియమైనవాడు.''

**మరియు** ''అల్లాహ్‌కు అతి ప్రీతికరమైన కార్యం ఒక ముస్లిం మనసును సంతోషపరచడం. లేక అతని ఒక కష్టాన్ని దూరం చేయడం. లేక అతని రుణాన్ని తీర్చడం. లేక అతని ఆకలిని దూరం చేయడం.''

**మరియు** ''నీవు నా మసీదులో అంటే మస్జిదే నబవీలో ఒకనెల (ఆరాధనకై) కూర్చోవడం కంటే ఎక్కువ ఇష్టమైన కార్యం నీవు ఒక సహోదరుని అవసరంలో సహాయపడడానికి నడిచి వెళ్ళడం.''

**మరియు** ''ఎవరికైతే కోపం వస్తుందో, దాన్ని చూపించే శక్తిసామర్థ్యాలు ఉన్నప్పటికి తమ కోపాన్ని దిగమింగేస్తే, ప్రళయదినాన అల్లాహ్ అతని మనసును సంతోషంతో నింపేస్తాడు.''

**మరియు** ''ఎవరైతే ఒక సహోదరుని వెంట వెళ్ళి అతని అవసరం తీరే వరకు అతనితో ఉంటాడో, వారి పాదాలను (ప్రళయ దినాన) అల్లాహ్ స్థిరంగా ఉంచుతాడు, ఏ రోజు అయితే (ప్రళయం రోజు) పాదాలు స్థిరంగా నిలబడలేవో!'' అని అన్నారు.[1]

[1] (తబ్రానీ: 862, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 2623).

https://teluguislam.net



హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

“ఎవరైతే ఒక విశ్వాసి (మూమిన్) కష్టాలలో నుండి ఒక కష్టాన్నయితే దూరం చేస్తాడో, ప్రళయ దినాన అల్లాహ్ అతని కష్టాలను దూరం చేస్తాడు. ఎవరైతే ఒకరి ఋణభారాన్ని సులభవంతంగా చేస్తాడో, అల్లాహ్ అతనితో ఇహపరలోకాలలో సులభతరంగా మసులుకుంటాడు.”

“ఎవరైతే ఒక ముస్లిం చేసిన తప్పును కప్పిపుచ్చుతాడో, అల్లాహ్ వారి తప్పులను ఇహపర లోకాలలో కప్పివేస్తాడు. ఎప్పటివరకైతే దాసుడు తన తోటి సహోదరుని సహాయంలో ఉంటాడో, అప్పటివరకు అల్లాహ్ ఆ దాసుని సహాయంలోనే ఉంటాడు...” [1]

హజ్రత్ అబూ హురైరా (సల్లల్లాహు అలైహి వసల్లం) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

ఒక వ్యక్తి అవసరమున్న వారికి అప్పులు ఇచ్చేవాడు. అతను తన అప్పులను వసూలు చేసే వ్యక్తికి ఇలా ఆదేశించేవాడు: “నీవు నిరుపేదల వద్ద అప్పును అడుగుటకై పోతే వారిని (క్షమించి) వదలిపెట్టు. దానివలన అల్లాహ్ మనల్ని (క్షమించి) వదలిపెట్టవచ్చు” అని చెప్పేవాడు.

తరువాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలిపారు: “అతను అల్లాహ్‌ను కలుసుకున్నాడు అల్లాహ్ అతనిని క్షమించాడు.” [2]

---

[1] (ముస్లిం:4867).

[2] (బుఖారీ:3221, ముస్లిం2922).

https://teluguislam.net



హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

“ఒక విశ్వాసి మరో విశ్వాసికి అద్దం లాంటివాడు, మరియు ఒక విశ్వాసి మరో విశ్వాసికి సోదరుడు. అతనికి అన్ని విధాల ఆర్థిక సహాయం చేస్తాడు, మరియు అతని వెనక నుండి కూడా సంరక్షకుడిగా ఉంటాడు.” [1]

అల్లాహ్ ఇలా తెలియజేశాడు: “మీలోని ఐశ్వర్యవంతులు, స్థితి మంతులు తమ బంధువులకు, నిరుపేదలకు, అల్లాహ్ మార్గంలో స్వస్థలం వదలి వచ్చిన వారికి ‘ఇవ్వబోము’ అని ఒట్టు పెట్టుకోరాదు. పైగా వారిని క్షమించాలి. (వారిపట్ల) మన్నింపుల వైఖరిని అవలంబించాలి. ఏమిటీ, అల్లాహ్ మిమ్మల్ని క్షమించాలని మీరు అభిలషించరా? అల్లాహ్ మాత్రం (తప్పులను) క్షమించేవాడు, కరుణామయుడు.” [2]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) గారిపై అపనిందలో పాల్గొన్న మిస్తహ్ పేదవారు. దైవ మార్గంలో వలస వచ్చినవారు(ముహాజిర్). పైగా ఆయన హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) గారికి పిన్నికొడుకు అవుతారు.

అందువల్ల ఆయన పోషణా బాధ్యతను హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) స్వీకరించారు. కాని ఈ సంఘటన కారణంగా ఆ తండ్రి మనస్సు చివుక్కుమంది. ఇలా జరగటం సహజం కూడాను.

“ఇకమీదట ఎన్నడూ మిస్తహ్‌కు ఆర్థిక సహాయం అందజేయనని హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) కోపంతో ఒట్టేసుకున్నారు.”

---

[1] (సహీహ్ అబూదావూద్: 4918).
[2] (సూరతున్ నూర్: 22).

https://teluguislam.net



ఈ విధంగా **ప్రతిన బూనటం అల్లాహ్‌కు నచ్చలేదు.** హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) మామూలు వ్యక్తి కారు. సాధారణ వ్యక్తి వల్ల ఇలాంటి చిన్న పొరపాటు జరిగితే అది తీవ్రంగా పరిగణించబడేది కాదేమో!

కాని ఆ తండ్రి మనసు ఎంతగా తల్లడిల్లినప్పటికీ – ప్రతీకారవాంఛతో– ధన సహాయాన్ని నిలిపివేస్తాననటం ఆయన సత్యసంధతకు, ఔదార్యానికి శోభయమానం కాదుకదా!

అందుకే!అల్లాహ్ చాలా సుతిమెత్తగా హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) మానవ సహజ దౌర్బల్యాన్ని ఎత్తి చూపిస్తూ, మన్నింపుల వైఖరిని అవలంబించవలసిందిగా ఉపదేశించాడు. అల్లాహ్ మీ తప్పుల్ని మన్నించాలన్నది మీ అభిమతం కాదా?! అంటూ క్షమా గుణాన్ని, ప్రేమసాగరాన్ని చిలికించాడు.

ఈ ఆదేశాన్ని విన్నంతనే హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) లోని గుండె ద్రవించింది. ఔదార్యం వర్షించసాగింది. **'ఓ ప్రభూ! నీ క్షమాబిక్షను ఎందుకు అభిలషించము? నీవు మమ్మల్ని క్షమించాలని మనసారా కోరుకుంటున్నాము'** అని ప్రతిస్పందించారు.

తరువాత ఆయన తన ప్రమాణ భంగానికి పరిహారం (కఫ్ఫారా) చెల్లించి, మిస్తహ్ పోషణాభారాన్ని మునుపటి మాదిరిగానే స్వీకరించారు. [1]

## అనాధులను ఆదరిస్తే అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు:

అల్లాహ్ ఇలా ఆదేశించాడు: ''నీవు అనాధుల పట్ల కఠినంగా ప్రవర్తించకు – మరియు యాచకుణ్ణి కసరుకోకు.'' [2]

---

[1] (ఫత్‌హుల్ ఖదీర్, ఇబ్ను కసీర్, అహ్‌సనుల్ బయాన్: తెలుగు:1513).

[2] (సూరతు జుహా:9–10).

https://teluguislam.net



హ్రజత్ అబూ హురైరా: (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: ‘‘అనాధుల పోషకుడు, అనాధకు బంధువైనా, కాకపోయినా సరే, నేను మరియు అతను స్వర్గంలో ఈ రెండు ప్రేళ్ళు మాదిరిగా (కలిసి) ఉంటాం...’’[1]

హ్రజత్ సహ్ల్ బిన్ సాద్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘నేను మరియు అనాధుల పోషకుడు స్వర్గంలో ఇలా ఉంటాం’’ ఆయన తన చూపుడు ప్రేలు మరియు మధ్య ప్రేలిని కలపకుండా, కొంత సందు ఉంచి చూపించారు. [2]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘ఓ అల్లాహ్! ఇద్దరు అబలల హక్కుల విషయంలో నేను ప్రజలను పదేపదే భయపెడుతున్నాను. వారు అనాథ మరియు స్త్రీ.’’ [3]

## ఆడ పిల్లలను పెంచి పోషిస్తే అల్లాహ్ స్వర్గాన్ని ప్రసాదిస్తాడు:

మానవ చరిత్రలో మహా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ఆవిర్భావానికి పూర్వం వరకు స్త్రీ మూర్తిని అనేక విధాలుగా అవమాన పర్చడం జరిగింది. యూదులు స్త్రీని పాపాలకు తల్లిగా, చెడుకు మూలంగా, మానవత నుదిటిపై మచ్చగా తీర్మానిస్తే, క్రైస్తవులు ఆమెను ఒక వ్యక్తిగా అంగీకరించేందుకు సైతం నిరాకరించారు. అంతేగాకుండా స్త్రీ మానవ రూపంలోని ఒక పిశాచిగా తీర్మానించారు. హిందూమతంలో ఆడపిల్ల

---

[1] (ముస్లిం:5296).

[2] (బుఖారీ:4892).

[3] (సహీహ్ ఇబ్ను మాజా: 3678).

https://teluguislam.net



పుట్టుకను అశుభమైనదిగా భావించడం జరిగింది. ఆడపిల్ల వివాహం జరిగిన తార్వత దౌర్భాగ్యవశాత్తూ ఒకవేళ ఆమె భర్త చనిపోయినట్లయితే ఆమెకు క్రింద పేర్కొనబడిన మార్గాలలో నుంచి ఏదో ఒక మార్గాన్ని ఎంచుకోవడం మినహా మార్గాంతరం లేకుండాపోయేది.

1) ఆమె తన కొరకు మృత్యువు కంటే హీనమయిన జీవితాన్ని ఎంచుకోవాలి.

2) భర్త చితితో పాటే ఆమె కూడా సహగమనం చేసి సజీవంగా దహనమైపోయి బూడిదగా మారిపోవాలి.

ఇక అరేబియాలో కూడా నాడు ఆడపిల్ల పుట్టుకను అప్రతిష్ఠగా భావించేవారు. ఏ ఇంటిలోనయితే ఆడపిల్ల పుడుతుందో ఆ ఇంటి యజమాని తన ముఖాన్ని ప్రజలకు చూపించకుండా చాటేస్తూ తిరిగేవాడు. అంతే గాకుండా అప్పుడే పుట్టిన ఆడ శిశువులను సజీవంగా భూమిలో పాతిపెట్టి తమ చర్య పట్ల గర్వించేవారు.

అటువంటి తరుణంలో సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్ ఆఖరి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన కారుణ్య మూర్తిగా ప్రభవింపజేశాడు. దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన కారుణ్య ఖజానాలను సమస్త మానవాళిపై కుమ్మరించడమే కాకుండా తన వాత్సల్యంతో సున్నితమైన అస్తిత్వమైన స్త్రీని సైతం సుసంపన్నం కావించారు. ఆడపిల్లల కొరకు, మహిళల కొరకు ప్రత్యేకమైన ఆదేశాలను అందజేశారు. ఆడపిల్లలను పెంచి పెద్ద చేసేవారికి, మంచి శిక్షణను వారికి అందజేస్తే స్వర్గలోకపు శుభవార్తను అందజేశారు.

https://teluguislam.net



కనుక ఖుర్‌ఆన్ గ్రంథంలో అల్లాహ్ ఇలా తెలియజేశాడు: “మరియు మీరు వారి(స్త్రీల)పట్ల సద్భావాంతో మెలగండి.” [1]

హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

“ముగ్గురు కూతుళ్ళు ఉంటే వారి పట్ల సహనంతో మసులుకొని, తమ శక్తికొద్దీ వారికి తినిపించి, త్రాపించి, తొడిగించి (పెంచి పెద్దచేస్తే) ప్రళయం రోజున అతనికై (ఆ మహిళలు) నరకాగ్నికి అడ్డుగా ఉంటారు.” [2]

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

“ఎవరికైనా ముగ్గురు కూతుళ్ళు లేదా ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉండి, లేక ఇద్దరు కూతుళ్లు, లేదా ఇద్దరు అక్కాచెల్లెళ్ళు ఉండి వారిని చక్కగా పెంచి, పోషించి వారి(హక్కుల)పట్ల అల్లాహ్‌తో భయపడి నడుచుకుంటే అలాంటి వారికి స్వర్గమే నిలయం.” [3]

హజ్రత్ అబూసయీద్ అల్ ఖుద్రీ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: “ఎవరికైనా ముగ్గురు కూతుళ్ళు లేదా ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉండి, లేక ఇద్దరు కూతుళ్లు, లేదా ఇద్దరు అక్కాచెల్లెళ్ళు ఉండి వారిని చక్కగా పెంచి, వారిని వివాహం చేసి, వారికి మేలు చేస్తే అతనికి స్వర్గం.” [4]

---

[1] (సూరతున్ నిసా: 19).
[2] (బుఖారీ, ఫిల్ అదబుల్ ముఫ్రద్: 13–14, అహ్మద్: 4/154, సహీహ్ ఇబ్ను మాజా: 3669).
[3] (సహీహ్ తిర్మిజీ: 1916, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 1973).
[4] (అబూదావూద్, అద్దుర్రుల్ మన్సూర్, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 1973).

https://teluguislam.net



ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: “ఎవరైనా ఇద్దరు కూతుళ్ళను లేదా ముగ్గురు అక్కాచెల్లెళ్ళను, లేక ముగ్గురు కూతుళ్ళను లేదా ఇద్దరు అక్కాచెల్లెళ్ళను వారు చనిపోయే వరకు లేదా అతను చనిపోయే వరకు పోషిస్తే (ప్రళయ దినాన) నేను మరియు అతను ఈ వేళ్ళవలె ఉంటాము అని చూపుడు వేలును మరియు మధ్యవేలును కలిపి చూపిస్తూ అన్నారు.” [1]

హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: “ఎవడైతే ఇద్దరి ఆడ సంతానాన్ని పోషిస్తాడో, అతను మరియు నేను స్వర్గంలో ఇలా ఉంటాము అని, చూపుడు వేలును మరియు మధ్యవేలును కలిపి సైగ చేశారు.” [2]

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హు) కథనం; ‘నా వద్దకు ఒక అభాగ్యురాలు తన ఇద్దరు కూతుళ్ళను ఎత్తుకొని వచ్చింది. నేనామెకు తినడానికి మూడు ఖర్జూరపండ్లు ఇచ్చాను.

ఆమె వాటిలో రెండు ఖర్జూర పండ్లు ఇద్దరు కూతుళ్ళకు తలా ఒకటి ఇచ్చి మిగిలిన ఒక ఖర్జూరపండును తన నోట్లో వేసుకోపోయింది.

అంతలో ఆ ఇద్దరు కూతుళ్ళూ ఆ ఖర్జూరపండు కూడా కావాలని అడిగారు.

వెంటనే ఆమె తాను తినాలనుకున్న ఆ ఖర్జూరాన్ని రెండు ముక్కలు చేసి ఇద్దరు కూతుళ్ళకు పంచివేసింది.

అది చూసి నాకు చాలా సంతోషం కలిగింది. నేనీ విషయాన్ని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు తెలియజేసాను.

---

[1] (అహ్మద్:12041, సిల్‌సిలతుస్ సహీహా: 296).

[2] (సహీహ్ తిర్మిజీ: 1914, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 1970).

https://teluguislam.net



దానిపై ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా పేర్కొన్నారు: ‘‘అల్లాహ్ ఆమె చర్య కారణంగా ఆమెకొరకు స్వర్గం తప్పనిసరి చేశాడు. లేదా ఆమెకు నరకం నుంచి విముక్తిని ప్రసాదించాడు.’’[1]

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి నలుగురు కూతుర్లు, మరియు ఇద్దరు కుమారులు. కాని ఇద్దరు కుమారులు చిన్న తనంలోనే చనిపోయారు. ఆడ పిల్లలను ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అమితంగా ప్రేమించేవారు. చివరికి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏదయినా యుద్ధం నుంచి లేదా ప్రయాణం నుంచి తిరిగి వచ్చినప్పుడల్లా అన్నిటికంటే ముందు మస్జిద్‌కు వెళ్ళి ఆ తర్వాత తనకు ఎంతో ప్రాణప్రదమైన కుమార్తె హజ్రత్ ఫాతిమా (రజియల్లాహు అన్హా) ఇంటికి వెళ్ళేవారు.

ఈ విధంగా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కు విశ్వ ప్రభువైన అల్లాహ్ తర్వాత అన్నిటికంటే ఎక్కువగా తమ కుమార్తె గుర్తుకొచ్చేవారు.

హజ్రత్ మిస్వర్ బిన్ మఖ్‌రమా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ‘‘నిశ్చయంగా ఫాతిమా (రజియల్లాహు అన్హు) నాలోని ఒక భాగము. మరియు ఆమెను బాధపెట్టటాన్ని నేను సహించను...’’ [2]

హజ్రత్ ఉమ్మె సల్మా (రజియల్లాహు అన్హు) కథనం; ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్రత్ **‘ఫాతిమా’**ను పిలుపించారు.

---

[1] (ముస్లిం:4764).
[2] (బుఖారీ:3450).

https://teluguislam.net



**ఆయన ఆమెతో:** ‘‘గుసగుసలాడగా ఆమె ఏడ్వనారంభించారు. తిరిగి ఆమెను పిలిచి చెవిలో ఏదో చెప్పగా ఆమె నవ్వనారంభించారు.’’

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి మరణానంతరం మేము ఆమెతో ‘‘ఏడ్వటానికి, నవ్వటానికి కారణమేమీ?’’ అని అడిగాము.

**తరువాత ఆమె ఇలా చెప్పారు:** మొదటి సారి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో గుసగుసలాడి చెప్పింది:

‘‘ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) చనిపోతారనే విషయం.’’ కాబట్టి నేను ఏడ్చాను.

**తరువాత నా చెవిలో చెప్పింది:** ‘‘నా కుటుంబంలో అందరికంటే ముందు నీవే నాతో కలుసుకోబోతున్నావు (మరణిస్తావు). మరియు నేను స్వర్గంలో ఉన్న స్త్రీలందరికీ సయ్యిదా(నాయకురాలు)ని, మర్యమ్ బిన్తె ఇమ్రాన్ (అలైహిస్సలామ్) గారికి తప్ప’’ అని అనగా నేను నవ్వాను. [1]

కానీ శోచనీయమైన విషయమేమిటంటే అజ్ఞాన కాలపు అరబ్బుల్లో ఉన్న దురాచారమే నేటి తల్లిదండ్రుల్లోనూ ప్రబలి ఉంది అనగా కుమార్తెలు, కుమారుల మధ్య వ్యత్యాసం కనబరచడం, కుమారులకు కుమార్తెలకంటే ఎక్కువగా ప్రాధాన్యతనివ్వడం మొదలయినవి.

కొడుకు పుట్టగానే లడ్డూలు పంచుతూ, కూతురు పుట్టగానే ముఖాన్ని వేలాడేసుకునేవారు, తమ భార్యల మీద అలిగేవారు ఎంతమందో కదా! కేవలం భార్యల మీద అలగడం మాత్రమే కాకుండా కొంతమంది పురుషులయితే కూతురు పుట్టిన కారణంగా తమ భార్యలకు విడాకులు సైతం ఇచ్చిన దాఖలాలు ఉన్నాయి.

---

[1] (సహీహ్ తిర్మిజీ: 3893, మరియు బుఖారీ, ముస్లిం,).

https://teluguislam.net



వేలాదిమంది తమ భార్యలు గర్భం ధరించియున్న కాలంలో స్కానింగ్ ద్వారా పుట్టబోయే బిడ్డ ఆడపిల్ల అని తెలుసుకోగానే అబార్షన్ (గర్భస్రావం) చేయిస్తున్నారు.

ఇటువంటి ఎన్నో సంఘటనల్లో ఎంతోమంది స్త్రీల విలువయిన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఆఖరికి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రభావానికి ముందు అజ్ఞానకాలంలో అరబ్బు జాతిలో ఉండిన మహా అజ్ఞానం వంటిదే ఇది. వారు అమాయకులైన ఆడపిల్లలను సజీవంగా పాతిపెట్టేవారు.

ఈ విషయం గురించి అల్లాహ్ ఖుర్ఆన్‌గ్రంథంలో ఈ విధంగా పేర్కొన్నాడు: సజీవంగా పాతిపెట్టిన బాలికలను **'నీవు ఏ నేరం కారణంగా హతమార్చబడ్డావు?'** అని ప్రశ్నించడం జరిగినప్పుడు..'' [1]

మరియు అల్లాహ్ ఇలా తెలియజేశాడు: ''తాను కోరిన వారికి ఆడపిల్లల్ని ఇస్తాడు, తాను కోరిన వారికి మగపిల్లల్ని ఇస్తాడు. – లేదా వారికి మగ పిల్లలను, ఆడపిల్లలను కలిపి ఇస్తాడు. మరి తాను కోరిన వారిని సంతాన హీనులుగా చేస్తాడు. ఆయన మహాజ్ఞాని, సంపూర్ణ అధికారం కలవాడు.'' [2]

కనుక ఆడ, మగా అనే నిర్ణయం అల్లాహ్ నిర్ణయమే తప్ప స్త్రీకి లేక పురుషునికి దానిలో ఎలాంటి ప్రమేయం లేదు. ఇదంతా దైవలీల అని ప్రతి వ్యక్తికీ తెలుసు. అయినప్పటికి స్త్రీలను నిందచడం లేక వారిని తప్పు పట్టడం మనిషి మానవత విలువలు దిగజారడానికి మరియు మూర్ఖత్వానికి చిహ్నం తప్ప మరేమికాదు.

---

[1] (సూరతు తక్‌వీర్:8–9).

[2] (సూరతుష్ షూరా:49–50, ఇస్లాంలో పిల్లల శిక్షణ: 24–29).